బాధిత కుటుంబాలను మాజీఎమ్మెల్యే పరామర్శ

నాగర్‌కర్నూల్‌లో శ్రీనివాస్‌యాదవ్ మృతదేహం వద్ద మాజీఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తిమ్మాజిపేట, మార్చి 3 : మండలంలోని రెండు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అప్పాజిపల్లిలో పీఏసీసీఎస్ వైస్‌చైర్మన్ రాందేవ్‌రెడ్డి తల్లి మృతిచెందడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఇప్పలపల్లిలో మృతిచెందిన పార్టీ సీనియర్ నేత పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతి చెందడం పార్టీకి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. గ్రామంలో పురుషోత్తం అనే బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు జోగుప్రదీప్, మాజీఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, హుస్సేని, మురళీధర్‌రెడ్డి, సైఫొద్దీన్, జైపాల్, వెంకటేశ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో...

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 3 : జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు తిరుమల్‌యాదవ్ సోదరుడు శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి శ్రీనివాస్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అటవీసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

అమ్రాబాద్ అడవిలో చెలరేగిన మంటలు

- **డీఎఫ్‌వో రోహిత్ గోపిడి**

అమ్రాబాద్, మార్చి 3 : జిల్లాలో నల్లమల అడవి ప్రాంతంలో అటవిసిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి సోమవారం అన్నారు. నల్లమల ప్రాంతం అమ్రాబాద్ టైగర్ రిజర్వు అడవిలో మండలంలోని దూబోడు బీట్ తాటిగుండాల్ సెక్షన్ అమ్రాబాద్ అటవీ బ్లాక్ కంపార్ట్‌మెంట్‌లో ఆదివారం అర్ధరాత్రి మంటలు వ్యాపించాయి. అటవీబ్లాక్ కంపార్ట్‌మెంట్ 200, 217 మంటలు గుర్తించిన అటవి సిబ్బంది జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి ఆధ్వర్యంలో సుమారు 40 మంది టీమ్‌ల సాయంతో ఫైర్ బ్లోయర్స్‌లతో మంటలను ఆర్పారు. వేసవికాలం ఉండడంతో అటవీసిబ్బంది, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో వారికి సూచించారు.

రైతులకు శాపంగా కాంగ్రెస్ సర్కార్

- **మాజీ జెడ్పీటీసీ చిట్టెమ్మ**

పెంట్లవెల్లి, మార్చి 3 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శాపంగా మారిందని జెడ్పీటీసీ మారుపాకుల చిట్టెమ్మ అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆరుగ్యారంటీలు.. 420హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి సర్కార్ సబ్బండ వర్గాలతో పాటు, రైతులను మోసగించిందని ఆమె ప్రభుత్వంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని విజయవంతంగా అమలుచేసి దేశంలోనే నెంబర్‌వన్ ముఖ్యమంత్రిగా నిల్చిపోయారన్నారు. రైతాంగానికి సరైన వేళల్లో ఎరువులు, సాగునీరు, విద్యుత్ అంతేగాక పంటపెట్టుబడి కోసం రైతులు ఎదురుచూడకముందే రైతులఖాతాల్లో రైతుబంధు వేసిన ఘనత కేవలం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో కొత్త సంక్షేమ పథకాలు దేవుడెరుగుగాని.. ఉన్న పథకాలే అమలు చేయలేక చేతులెత్తేసిందని ఆరోపించారు. రైతులకు సకాలంలో విద్యుత్ లేదు, ఎరువులు, సాగునీరు అందడం లేదని మండిపడ్డారు. రైతులఖాతాలో టకీ..టకీ మని రైతుభరోసా డబ్బులు పడతాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మోసపూరిత మాటలకు రైతులు ఎదురుచూసి, ఎదురుచూసి కండ్లు కాయలు కాశాయని విమర్శించారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వేరుశెనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

- **ఎమ్మెల్యే వంశీకృష్ణ**

ఉప్పునుంతల, మార్చి 3 : రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వేరుశెనగ కొనుగోలు కేంద్రాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. సోమవారం ప్రభుత్వం మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుధర కల్పించడం కోసం ఏర్పాటు చేసిన వేరుశెనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నియోజకవర్గంలో అచ్చంపేటతో పాటు బల్మూర్ మండలం తుమ్మెన్‌పేటలో కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని ఇకనుంచి ఉప్పునుంతల సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిరంతరంగా వేరుసెనగ కొనుగోలు కేంద్రం పనిచేస్తుందన్నారు. గింజశాతం 65 ఉంటే మద్దతుధర రూ.6,783 క్వింటాకు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్లు భూపాల్ రావు, నర్సయ్యాయాదవ్, సీఈవోలు రవీందర్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్‌శాఖ అధికారులు మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు నారంరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యామండలి చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 3 : ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డిని హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసిన ఎమ్మెల్యే జిల్లా కేంద్రంలో జేఎన్‌టీయూ క్యాంపస్ ఏర్పాటుపై లిఖితపూర్వకంగా కోరారు. అందులో భాగంగానే చైర్మన్‌ను కలిసి అందుకు కావాల్సిన మౌళిక వసతుల ఏర్పాటు, మొదట ఏఏ కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలనే విషయాలపై చర్చించడం జరిగిందన్నారు. చైర్మన్ బాలకృష్ణారెడ్డిది నాగర్‌కర్నూల్ జిల్లా కావడం వల్ల చాలా సానుకూలంగా స్పందించారన్నారు. కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యేతో కలిసి కృషి చేస్తానని ఉన్నత విద్యామండలి బాలకృష్ణారెడ్డి చెప్పారు.

SHRIRAM Finance
వాహనములు అమ్మబడును

SNo.	VEHICLE NO.	DISCRIPTION	MODEL
1	TS31-B 5305	TAFE MF9500 TRACTOR BS IIIA	2017
2	TS 31 H 7137	MAHINDRA 575 DI XP PLUS BP BS IIIA	2022

పై వాహనాలు తేది : 04-03-2025 నాడు వేలం వేయబడును
అడ్రస్: శ్రీరామ్ ఆటో మాల్ యార్డ్, భూత్పూర్, మహబూబ్‌నగర్
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
H.No. 9-47,9-48,9-49, 1st Floor, Vasavi Padmavathi Complex, పుల్లారెడ్డి హాస్పిటల్ ప్రక్కన, నాగర్‌కర్నూల్. 9542518656

సత్వరమే ఫిర్యాదులను పరిష్కరించాలి

- **ఏవో చంద్రశేఖర్**
- **జిల్లా కలెక్టరేట్‌లో 23, ఎస్పీ కార్యాలయానికి 10 ఫిర్యాదులు**

ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 3 : వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఏవో 23 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖాధికారులు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయానికి 10 ఫిర్యాదులు:

జిల్లా ఎస్పీ కార్యాలయానికి సోమవారం పది ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఏఎస్పీ రామేశ్వర్ స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయాప్రాంతాల పోలీస్ అధికారులకు పరిష్కారానికై ఆదేశించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదుల్లో న్యాయం చేయాలంటూ 2, భూమి పంచాయతీకి సంబంధించి, భార్యభర్తల గొడవకు సంబంధించి ఒకరు ఫిర్యాదు చేశారు.

న్యాయం చేయండి ..

- **ప్రజావాణిలో ఎమ్మెల్యే స్వగ్రామం తూడుకుర్తి దళిత రైతులు**

ప్రజావాణి ఫిర్యాదులో గ్రామస్తులు

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 3 : మండలంలోని తూడుకుర్తి గ్రామంలో దళితులకు పంపిణీ చేసిన వంద ఎకరాల భూమిని వారి పేర్లపై మార్చి నూతన పాస్ బుక్కులు ఇవ్వాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌తో విన్నవించుకున్నారు. వివరాలిలా.. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి స్వగ్రామమైన తూడుకుర్తిలో 50ఏండ్ల కిందట సర్వే నెంబరు 766లో ఉన్న సుమారు 100ఎకరాల విస్తీర్ణం గల భూమిని పేద దళిత కుటుంబాలకు (100మందికి) ప్రభుత్వమే పంపిణీ చేసింది. ఆ నాటి నుంచి నేటివరకు దళిత రైతులు వారికి కేటాయించిన ఆ భూమిలో వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారని కానీ గత ప్రభుత్వం 2017లో సమగ్ర సర్వే చేసినప్పుడు సర్వే నెంబరు 766లోని (100ఎకరాల) దళిత రైతుల భూమిని పార్ట్ బీలో చూపి పెండింగ్‌లో పెట్టారు. గడిచిన ఎనిమిదేండ్ల నుంచి దళితులకు కేటాయించిన భూమిని రికార్డులల్లో పొందుపర్చనందున తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌వోఆర్‌లో దళిత రైతుల పేర్లను నమోదు చేసి తమకు కొత్త పాస్ బుక్కులు ఇప్పించాలని తూడుకుర్తి గ్రామస్తులు కోరారు.

రెండుబైక్‌లు ఢీకొని యువకుడు మృతి

పెద్దకొత్తపల్లి, మార్చి 3 : మండలంలోని సాతాపూర్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు మేరకు.. ముష్టిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య కుమారుడు సాంబశివుడు 25 ఆదివారం రాత్రి తన స్నేహితుడు జగదీశ్‌తో కలసి వెళ్తుండగా సాతాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్, మల్లేశ్ కొత్తపేట నుంచి సాతాపూర్‌కు వస్తుండగా సాతాపూర్ గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఇరుబైక్‌లు ఢీకొనడంతో సాంబశివుడు అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన మరోఇద్దరి యువకులను 108 ద్వారా నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 3 : రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని పాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని ఉయ్యాలవాడకు చెందిన వెంకట్రాములు అనే వ్యక్తి తన బైక్‌పై బిజినేపల్లి స్వగ్రామం ఉయ్యాలవాడకు వస్తుండగా నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన బస్సు వనపర్తి వెళ్తూ పాలెం బస్టాండ్‌లోకి వెళ్తున్న క్రమంలో ఢీకొన్నది. దీంతో వెంకట్రాములుకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం బిజినేపల్లి దవాఖానకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి..

కల్వకుర్తి రూరల్, మార్చి 3 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాపట్లకు చెందిన ఏసుపాదం(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏసుపాదం కల్వకుర్తి పట్టణంలో గృహనిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ స్వాతి ఫంక్షన్‌హాల్ సమీపంలో కొత్త ఇంటి మూడోఫ్లోర్‌లో పనులు చేస్తూ ప్రమాదవశాత్తు పడిపోయాడు. గమనించిన కార్మికులు అతడిని వెంటనే కల్వకుర్తి దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందాడు. సోమవారం ఏసుపాదం అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నాడు.

ఆర్టీసీబస్సు ఢీకొని వ్యక్తి మృతి

బిజినేపల్లి, మార్చి 3 : ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మంగనూర్-వెల్గొండ గ్రామాల మధ్య చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిట్యాతండా గ్రామపంచాయతీలోని భీముడితండాకు చెందిన జానూనాయక్(34) తన బైక్‌పై బిజినేపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడన్నారు. ఈ క్రమంలో తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మహబూబ్‌నగర్ నుంచి శ్రీశైలం వెళ్తుండగా మంగనూర్, వెల్గొండ గ్రామాల మధ్య బైక్‌పై వెళ్తున్న జానూనాయక్‌ను బస్సు ఢీకొట్టిందన్నారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య కవితతోపాటు ముగ్గురు సంతానం ఉన్నారని తెలిపారు.

నేడు జాబ్‌మేళా..

కల్వకుర్తి రూరల్, మార్చి 3 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ సోమవారం తెలిపారు. ఐటీఐ పాస్‌అయి 18 నుంచి 23 ఏండ్ల లోపు ఉన్నవారు అప్రెంటీస్ జాబ్‌మేళాకు హాజరుకావొచ్చన్నారు. జాబ్‌మేళాకు వచ్చే వారు తమ ఐటీఐ సర్టిఫికెట్లతో మంగళవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆమె కోరారు.

వినికిడి లోపాన్ని ముందే నివారించాలి

- **జిల్లా ప్రోగ్రాం అధికారి కృష్ణమోహన్**

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రోగ్రామ్ అధికారి

బిజినేపల్లి, ఫిబ్రవరి 3 : వినికిడి లోపాన్ని ముందే నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని పాలెం గ్రామంలోగల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు జ్ఞానేంద్రియాల్లో చెవులు అధిక ప్రాముఖ్యగలవన్నారు. మన చెరువులు శబ్దాన్ని 130 డెస్సీబెల్స్ వరకు వినగలుగుతాయన్నారు. వినికిడి లోపాలతో పుట్టిన శిశువుల్లో జన్యుపరమైన కారణాలతో వస్తాయని, వాటిని తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్సలు చేయడం ద్వారా పెరిగేలోపాన్ని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

జీతాలు ఇవ్వాలంటూ పంచాయతీ కార్మికుల నిరసన

జీతాలు ఇవ్వాలని తాసీల్దార్‌కు వినతి ఇస్తున్న పంచాయతీ సిబ్బంది

బిజినేపల్లి, ఫిబ్రవరి 3: బిజినేపల్లి గ్రామ పంచాయతీలో వర్కర్లుగా పనిచేస్తున్న సిబ్బంది తమకు జీతాలు ఇవ్వాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా తమకు జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. చాలీచాలని వేతనాలతో ముందే ఇబ్బందులు పడుతుంటే, దీనికితోడు వచ్చే జీతాలు కూడా సకాలంలో ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు జీతాలు క్రమం తప్పకుండా వచ్చే విధంగా చూడాలని గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి తహీసీల్దార్ శ్రీరాములుకు వినతి ఇచ్చారు. వారం రోజుల్లో తమ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పంచాయతీ సిబ్బంది ఆందోళన విరమించారు. కార్యక్రమంలో శ్రీశైలం, యశ్వంత్, మహేష్ ఉన్నారు.

రాష్ట్ర పోటీలకు విద్యార్థులు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, మార్చి 3 : పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్రకబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు సోమవారం ఫిజికల్ డైరెక్టర్ బాలు తెలిపారు. అచ్చంపేటలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 5నుంచి 7వ తేదీ వరకు వికారాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరుగునున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

గిరిజన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

అచ్చంపేట రూరల్, మార్చి 3 : తెలంగాణ గిరిజన ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని సోమవారం తెలంగాణ మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డి ని హైదరాబాద్‌లో చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసినట్లు గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అసోసియోషన్ అధ్యక్షుడు సభావత్ బీచ్యానాయక్ తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గిరిజన ఉద్యోగులకు 10 శాతం రిజర్వేషన్ సీనియార్టీ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. స్పందించిన ఆయన తప్పకుండా సీనియార్టీ ఫిక్సేషన్ చేసేటప్పుడు 10శాతం గిరిజన ఉద్యోగులకు రిజర్వేషన్లతో పాటు ప్రమోషన్లను ఆచరిస్తామని హామీ ఇచ్చారు. బీచ్యానాయక్‌తో పాటు తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాట్రావత్ రాంచందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

అమ్రాబాద్, మార్చి 3 : పదర ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అడిషన్ డీఆర్డీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీడీవో వెంకటయ్య అధ్యక్షతన గ్రామీణ జాతీయ ఉపాధిహామీ చట్టం 3వ సామాజిక తనిఖీపై ప్రజావేదికను సోమవారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మూడు వారాలుగా ఇంటింటికి తిరిగి ఉపాధి పథకం కింద మండలంలో జరిగిన అన్ని పనులపై తనిఖీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొత్తం రూ.12,836 పనులు జరిగాయి. అన్ని పనులు పూర్తి చేసిన వాటిలో రూ.5,836 రికవరీ అయ్యాయని వారు తెలిపారు. అదేవిధంగా పనులు పూర్తిచేయని వాటికి రూ.7వేలు జరిమానా రూపంలో వసూలు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీక్యాఈ కృష్ణారావు, ఎస్టీమ్ నసీరుద్దీన్, ఎస్ఆర్పీ బద్రు, అంబుడు సుమన్, విజిలెన్స్ అధికారులు, ఏపీడీ శ్రీనివాసులు, ఏఎన్ జంగయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకొత్తపల్లి, మార్చి 3 : రైతుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు మరణిస్తే ప్రభుత్వం రూ.5లక్షలు అందిస్తోందని సింగిల్ విండో వైస్‌చైర్మన్ రాజుయాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్దకార్పాముల గ్రామంలో రైతువేదికలో ఏర్పాటు చేసిన అగ్రిక్లినిక్‌లో ఆయన మాట్లాడారు.సమావేశంలో ఏఈవో జానకిరాములు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం పరిశీలన

తిమ్మాజిపేట, మార్చి 3 : మండలంలోని మరికల్ గ్రామంతలో ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులైన వారి వివరాలను ఎంపీడీవో లక్ష్మిదేవి సోమవారం పరిశీలించారు. ఇండ్లకోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇండ్లకు వెళ్లి వారి వివరాలను పరిశీలించారు. గత పంచాయతీ కార్యదర్శులు పరిశీలన చేశారని, వాటిని పునఃపరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి , ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటిస్థలాలు చూపించాలి

చారకొండ, మార్చి 3 : కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చారకొండ-మర్రిపల్లి వరకు బైపాస్ రోడ్డులో ఇండ్లు కోల్పోయిన నిరుపేదలకు ఇంటిస్థలం చూపించాలని సీపీఎం, సీపీఐ జిల్లా నేతలు బాలస్వామి, శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బైపాస్‌లో చారకొండ, మర్రిపల్లి గ్రామానికి చెందిన 29 మంది నిరుపేదల ఇండ్లు కోల్పోయారని బాధితులు రోడుపాలై దిక్కుతోచని స్థితిలోఉన్నారని చెప్పారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు సూపర్‌లగ్జరీ బస్సు

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 3 : నాగర్‌కర్నూల్ నుంచి అరుణాచల్ గిరిప్రదక్షిణను పురస్కరించుకొని ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును ప్రత్యేకంగా నడపబోవుచున్నామని డిపో మేనేజర్ యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు మార్చి12 సాయంత్రం 8 గంటలకు నాగర్‌కర్నూల్ బస్‌స్టేషన్ నుంచి బయల్దేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత 13మార్చి 2025 రాత్రి వరకు అరుణాచలం చేరుకుంటుందని 14 మార్చి 2025 పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ అనంతరం సాయంత్రం అరుణాచలం నుంచి బయల్దేరి 15 మార్చి 2025 ఉదయం నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో వెళ్లే భక్తులకు చార్జీ పెద్దలకు రూ.3600, పిల్లలకు రూ.2,400గా నిర్ణయించామన్నారు. అడ్వాన్స్ రిజర్వేషన్ కోసం ఫోన్ నెంబర్లు 9490411590, 9490411591కు సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

తాడూరు, మార్చి 3 : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతివిద్యార్థికి నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గుట్టలపల్లి, మేడిపూర్, పొల్కూరు, గుంతకోడూరు గ్రామాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా గుట్టలపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లనిర్మాణానికి భూమిపూజ

వంగూరు, మార్చి 3 : ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకున్న మండలంలోని మిట్టసదగోడులో సోమవారం రెండు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎంపీడీవో బ్రహ్మాచారి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలోని మిట్టసదగోడు గ్రామాన్ని ప్రభుత్వం ప్రత్యేక గ్రామంగా గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘంలో చేరండి

నాగర్‌కర్నూల్ రూరల్, మార్చి 3 : భారత ప్రజాతంత్ర యువజన సమైక్య(డీవైఎఫ్ఐ) సంఘంలో యువతి యువకులు పెద్దసంఖ్యలో చేరాలని జిల్లాసహాయ కార్యదర్శి నాగపూర్ మధు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీ యువతను సభ్యత్వంలో చేర్పించడం జరిగిందన్నారు. నాటినుంచి నేటివరకు యువతీ యువకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న ఏకైక సంఘం డీవైఎఫ్ఐ అని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు శివమల్లికార్జున్, సుల్తాన్, మహేశ్, అంజి, బద్రి తదితరులు పాల్గొన్నారు.

గుండాల